నమస్తే తెలంగాణ
తెలంగాణ జైత్రయాత్ర 2023
హైదరాబాద్ | గురువారం 30 నవంబర్ 2023 www.ntnews.com

తెలంగాణమా మేలుకో..
పోలింగ్ బూత్‌కు పోటెత్తు..
తెలంగాణను ముంచే భస్మాసుర
కాంగ్రెస్ రెక్కలిరగ్గొట్టు..

మన సంపదను గుజరాత్‌కు
పంచే బీజేపీని తరిమికొట్టు..
మన కీర్తిని పెంచే కేసీఆర్‌కు జై కొట్టు..
ఓటెయ్యి.. హ్యాట్రిక్ సీఎం అయ్యేట్టు

- సురేష్

నేనొస్తే పని చేస్తా అనేటోడ్ని
నమ్మి మునుగుదామా?
పని చేసి చూపించిన వాడికి
మద్దతిచ్చి మనుగడ సాగిద్దామా?

ఫన్‌టాస్టిక్

## తెలంగాణ వరమాల సంక్షేమానికే!

ఎన్నికల ఘట్టం చివరి దశకు చేరుకుంది. ఒకప్పుడు రాకుమారి కోసం రాజకుమారుల స్వయంవరం జరిగినట్టే ఓటరు వరమాల కోసం ఇప్పుడు ఆ ఘట్టం జరుగుతున్నది. ఓటరు మనసు దోచుకోవడానికి దేశ దేశాల నాయకులు, సామంతులు, బానిసలు అందరూ హాజరయ్యారు. తెలంగాణ పాలకులతో పాటు గుజరాతీ, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీల నుంచి వచ్చిన ఏలికలూ బల ప్రదర్శన చేసి వరమాలను గెలుచుకునే ప్రయత్నం ప్రారంభించారు.

ఓటరు రాకుమారి చేతిలో ఓటు దండ పట్టుకొని ఒక్కో రాజును చూస్తూ వెళుతున్నది.

గుజరాత్ రాజు, 'భాయియో ఔర్ బెహనో...' అని నాటకీయంగా పలకరించి, తన కన్నా అర్హుడు ఇంకొకరు లేరు అని చెప్పుకొచ్చాడు. గూగుల్‌లో గుజరాత్ రాజు చరిత్రను చూసిన ఓటరు రాకుమారి మనసులో 'ఒక్క మాట కూడా నిజం చెప్పడు. ఢిల్లీ రాజైనా గుజరాత్ రాజుగానే పాలిస్తున్నాడు. అబద్ధాలు చెప్పడం, ప్రజల మధ్య వైషమ్యాలు కలిగించడం తప్ప చేసిందేమీ లేదు...' అనుకొని ముందుకు వెళ్ళింది.

53 ఏళ్ల రాహుల్‌ను రాకుమారి సమీపించగానే, 'నేను స్వయంవరానికి వచ్చింది నా కోసం కాదు. మా కుటుంబ బానిస కోసం...' అంటూ తమ కుటుంబ కీర్తి ప్రతిష్ఠల గురించి చెప్పడం మొదలు పెట్టాడు. గూగుల్ చూడాల్సిన అవసరం కూడా లేదు. 'తెలంగాణను ఆంధ్రలో కలిపి రాచి రంపాన పెట్టిన మీ చరిత్ర బాగా తెలుసు...' అని ఓటరు రాకుమార్తె మనసులోనే అనుకుంది. అయినా దొంగ కోసం స్వయంవరానికి ఎలా రాబుద్ధి అయింది. పెండ్లికి వెళుతూ పిల్లిని చంకన పెట్టుకొని వచ్చినట్టు, దొంగను వెంట బెట్టుకొని వచ్చావు' అని మనసులో అనుకుంది. స్వయంవరంలో ఆ మాట బయటకు చెప్పడం మర్యాద కాదు కాబట్టి ఊరుకుంది. ముందుకు వెళుతుంటే 'నేనూ... ఇక్కడ నేనున్నాను...' అని మాటలు వినిపించాయి. మనిషి కనిపించకుండా మాటలు ఎక్కడి నుంచి వస్తున్నాయి... అని తలదించి చూస్తే మూడడుగుల కురచ మనిషి కనిపించాడు. నేను పులి బిడ్డను అంటూ తనగురించి తాను చెప్పుకున్నాడు.



'నీకు వరమాల వేస్తే ఏం చేస్తావ్? రాజ్యాన్ని ఎలా పోషిస్తావు' అని రాకుమారి అడిగితే... 'పిండాలు పెడతా, తొక్కుకుంటూ వెళతా, తన్నుతా, కూలుస్తా...' అంటూ ఆవేశంతో ఊగిపోయాడు. 'నీ హైటుకీ మాటకీ సంబంధం ఏమైనా ఉందా?' అని పలికి ఓటరు రాకుమారి ముందడుగు వేసింది.

పక్కన గుండుతో ఉన్న బండి ఆయన బుస్... బుస్ అంటూ ఏదో చెబుతున్నాడు. మాట్లాడటం రాని వారి మాటలను కూడా వినాలి అనే సంస్కారం ఉన్న రాకుమారి ఆక్కడ ఆగిపోయి 'టెన్షన్ వద్దు... మెల్లగా ఏం చెప్పాలి అనుకుంటున్నారో చెప్పండి' అంది.

'ప్రగతి భవన్ కూల్చేస్తా... బుల్ డోజర్లు తెస్తా... అడ్డం వచ్చిన వారి ఇంటిని బుల్ డోజర్‌తో కూల్చేస్తా... పేర్లు మార్చేస్తా...' అని ఆవేశంగా చెప్పాడు.

'కూల్చే పని కావాలంటే అడ్డా మీద నిలబడితే కాంట్రాక్టర్లు బోలెడు మంది దొరుకుతారు. స్వయంవరానికి రావడం ఎందుకు' అని ఓటరు రాకుమారి ముందుకు కదిలింది.

కారు పక్కన ధీమాగా నిలబడ్డ కారు ఆయన్ని చూస్తూ... 'నువ్వేం డైలాగులు చెప్పవేం...' అని రాకుమారి అడిగింది.

ఉట్టి మాటలు చెప్పడం కాదు. నా పదేండ్ల ట్రాక్ రికార్డ్ నా గురించి చెబుతుంది. గతంలో ఈ స్వయంవరం కూడా కరెంట్ లేకుండా చీకటిలో జరిగేది. నేను వచ్చాక 24 గంటల విద్యుత్, అందరికీ మంచి నీరు అందించాను. శాంతి భద్రతలు గాడిలో పెట్టాను. అన్నదాతకు అండగా నిలిచాను. నా పాలనలో రాజ్యం సుభిక్షంగా ఉంది. దశాబ్దం క్రితం తెలంగాణ రాజ్యం ఎలా ఉండేది, ఇప్పుడు ఎలా ఉందో... మీరే బేరీజు వేసుకొని, మీ రాజ్య బాధ్యత ఎవరికి అప్పగించాలో నిర్ణయించుకోండి... అని కారు ఆయన తన పదేండ్ల ప్రోగ్రెస్ కార్డును ఓటరు రాకుమారికి అందజేశారు.

'కార్డు చదవాల్సిన అవసరం లేదు. నేను ఈ పదేండ్లు సుభిక్షంగా, సురక్షితంగా ఉండడమే మీ పాలనకు సాక్ష్యం...' అంటూ రాకుమారి పూలదండ జాగ్రత్తగా పట్టుకొని కారు వైపు అడుగులు వేసింది.

■ మురళి



అసలు ముచ్చట

# కరెంట్.. మొనగాడు కేసీఆర్!

## పవర్ ప్రాబ్లమ్స్‌కు హాలిడేస్

**ఉమ్మడి రాష్ట్రంలో నిత్యం కరెంట్ కోతలే • రాత్రి కరెంటున్నా.. పని చేయకుండా ఆంక్షలు**

**అద్దెలు కట్టలేక మూతబడ్డ వర్క్‌షాప్‌లు • తెలంగాణ వచ్చినంక కరెంటు గోస తీర్చిన కేసీఆర్**

పవర్ హాలిడేస్ వారి జీవితాల్లో ఆనందాలకు సెలవులు ప్రకటించాయి. ఎన్ని కష్టాలుపడి ఇక్కడి కొచ్చారో.. అక్కడి నుంచి వారిని తరిమికొట్టింది కరెంటు తీగ. పైసా పైసా కూడగట్టి, అప్పూసొప్పజేసి చిన్న వర్క్‌షాప్ పెట్టుకుంటే కరెంటు కోతలు, అప్పులు వాళ్ల జీవితాలను ఆగమాగం చేశాయి. కరెంటు కావాలని ఇందిరాపార్క్ దగ్గర టెంటేసి ధర్నా చేసినా కరెంటు రాలేదు. కష్టాలు పోలేదు. వాళ్లే వర్క్‌షాప్‌లను వదిలేసి లేత్ మెషిన్లను రోడ్డున పడేశారు. పిలిచి వాళ్ల కష్టాలను ఒక రోజంతా విన్న కేసీఆర్‌ను మొదట్లో వారు నమ్మలేదు. 'ఇప్పుడు నేనేమీ చేయలేను. మీ కష్టాలు పోవాలంటే నాకు ఏడాది టైమ్ ఇవ్వాల'ని అడిగితే.. ఈయనా అందరిలాంటి ముఖ్యమంత్రేనని నిరాశతో వెనుదిరిగారు. ఆరు నెలలకే పారిశ్రామిక వాడల్లో కోతల్లేని కరెంటుతో వాళ్ల జిందగీ మారిపోయింది. తెలంగాణ ప్రగతికి మా సంతోషాలే శుభసూచకాలంటున్న జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలోని లేత్ మెషిన్ వర్కర్స్ కమ్ ఓనర్స్ చెబుతున్న ఆనాటి.. ఈనాటి అసలు ముచ్చట్లివి.

...నాగవర్ధన్ రాయల

సి.యం. ప్రవీణ్



తెలంగాణ వచ్చింది. కేసీఆర్ సీఎం అయ్యారు. కేసీఆర్ గ్రాండ్ కాకతీయ హోటల్‌లో మీటింగ్‌కు పిలిచిండు. ఇండస్ట్రీస్ అసోసియేషన్ తరఫున నేను కూడా పోయిన. పొద్దున 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు మీటింగ్ నడిచింది. మా బాధలన్నీ చెప్పాం. కేసీఆర్ సార్ ఓపిగ్గా విన్నారు. 'ఒక సంవత్సరం వరకైతే నేనేమీ చేయలేను. సంవత్సరం తర్వాత మీ సమస్యకు పరిష్కారం చూపిస్తా' అని సీఎం అన్నారు. చాలా నిరాశ పడ్డాం. ఈయన కూడా పాత వాళ్ల లాగే ఉన్నాడనుకుని బయటికి వచ్చాం. ఆయన చెప్పిన ఏడాది కంటే ముందే.. ఆరు నెలల్లోనే కరెంటు ఇచ్చారు. తెలంగాణ ప్రగతికి అదో శుభసూచకం అనుకున్నాం. ఇక మా బతుకులు మారాయి. తెలంగాణ కూడా మారింది. – అంబటి శ్రీనివాస్

**శ్రీనివాస్ చౌదరి:** కరెంటు బాధలు లేకుండ చేస్తమని పార్టీలోళ్లు ముచ్చట చెప్పబట్టె. కరెంటు బాధల్ని సీఎం కేసీఆర్ తీర్చినంక వాళ్లు చేసేదేముంది? ఇప్పుడు 24 గంటలూ కరెంటు ఉంటుండె. పొద్దున తొమ్మిదింటికి వచ్చి రాత్రి తొమ్మిదింటికి పోతున్నం.

**అంబటి శ్రీనివాస్:** అప్పట్లో కరెంటు లేక ఎన్నేండ్లు బాధలుపడ్డం! 2012 నుంచి తెలంగాణ వచ్చేదాక ఇందిరాపార్క్ దగ్గర ధర్నాలే.

**ఎంవీ స్వామి నాయుడు:** 'రోజుకు నాలుగు గంటలు పవర్ కట్' అని అప్పటి ప్రభుత్వం అన్నది. చెప్పినట్టు కరెంట్ బంద్ చేశారు. సాయంత్రం ఆరు గంటల తర్వాత పని చేయొద్దనేవాళ్లు. వర్క్‌షాప్ మూసేయాలనేవాళ్లు. ఆరు గంటలకు బంద్ చేస్తే ఎట్లా పని పూర్తి చేయాలె. పని బంద్ చేయకపోతే ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసేవాళ్లు.

**శివరామకృష్ణ:** పవర్ హాలిడే ఉంటే పని చేయకున్నా వర్కర్‌కు జీతం ఇవ్వాలి. షెడ్‌కు రెంట్ కట్టాలి. పని నడవాలంటే నాలుగు గంటలు సరిపోదు. సాయంత్రం కరెంటు వచ్చాక కార్మికులు రారు. ఓటీ ఇచ్చి మరీ పని చేయించుకోవాలి.

**శ్రీనివాస చౌదరి:** ఓటీలు ఇచ్చినా పనేడ నడిచేది? కరెంటోళ్లు వచ్చి మెయిన్ బంద్ చేసి పోయేవాళ్లు. కరెంటోళ్లకు భయపడి షట్టర్లు మూసి పని చేసిన. అయినా బలవంతంగా బంద్ చేసిన రోజులూ గుర్తే.

**అంబటి శ్రీనివాస్:** అప్పులు చేశి వర్క్‌షాప్ పెట్టుకున్న. కరెంటు లేక పని ఆగుతుండె. టైమ్‌కు ఆర్డర్లియ్యక కంపెనీల ఆర్డర్లూ తగ్గుతుండె. ఆరు రూపాయలు, నాలుగు రూపాయల వడ్డీకి తెచ్చి నడిపిన. ఆ కరెంటు కష్టాల్లో వచ్చేది కాస్తా జీతాలు, అద్దెలకే సరిపోతుండె. వడ్డీలోళ్లు వచ్చి సతాయిస్తుంటె ఏం చేయాల్నో తెలియక ఎంత బాధపడ్డనో.

**శ్రీనివాస్ చౌదరి:** ఆదుకోవాల్సిన గవర్నమెంటే బాధలుపెట్టింది. అప్పులోడికి మన బాధలు పట్టవు. 'కడ్తవా? చస్తవా?' అని మెడమీద కత్తి పెడతడు. బంగారం తాకట్టు పెట్టి బాకీలు కట్టిన. ఆ అప్పు తీర్చలే. తాకట్టులో బంగారం అటే పోయింది.

**శివరామకృష్ణ:** చివరికి మమ్మల్ని నమ్ముకున్న కార్మికుల్నీ తీసేయాల్సి వచ్చింది. ఏడుగురిలో ఇద్దరే



మిగిలారు.కరెంటు వచ్చిన తర్వాత మళ్లీ ఎనిమిది మంది అయ్యారు.

**అంబటి శ్రీనివాస్:** ఆదాయం పడిపోయింది. ఖర్చులు తగ్గట్లేదు. ఇంట్లో ఖర్చులు. ఈ బాధల్నుంచి బయటపడాల్నని బ్యాంకుకు పోతే లోన్ ఇవ్వలేమని తెగేసి చెప్పారు. కరెంటు లేనప్పుడు అప్పు ఎలా తీరుస్తారని బ్యాంక్ వాళ్లు మమ్మల్ని ఎదురు ప్రశ్న వేసేవారు.

**దాసరి శ్రీనివాస్:** ఆ కరెంట్ కోతలతో అందరినీ తీసేసి నేనొక్కడినే నడిపిన. అట్లా నడిపినా కష్టంగానే ఉండేది.

**శివరామకృష్ణ:** నాకు కరెంట్ బిల్లు ఎక్కువ వస్తున్నది.. ఇదేమిటని కరెంటోళ్లను అడిగిన. ఒకప్పుడు సబ్సిడీకి ఇచ్చాం. ఆ నష్టాన్ని ఇప్పుడు రాబట్టుకుంటున్నామని సెలవిచ్చారు. ఎవడికో రాయితీ ఇచ్చి నా దగ్గర వసూలు చేయడం ఏందని అడిగితే.. అదే మీటరు వాడుతున్నావు.. కాబట్టి తప్పదన్నారు. చేసేది లేక బాలానగర్‌లోని షెడ్డు ఖాళీ చేసిన. మెషిన్లన్నీ జీడిమెట్లలో ఖాళీ జాగలో వదిలేసిన.

**ఎంవీ స్వామినాయుడు:** మేమంతా అట్ల కరెంటు కష్టాలు పడలేక వర్క్‌షాప్‌లను వదిలేసిన వాళ్లమే. మెషిన్లన్నీ ఒకే ఖాళీ జాగలో వదిలేసినం. మెషిన్లను కాపాడుకునేందుకు ఆరు నెలల తర్వాత చిన్న షెడ్డు వేసినం. అట్ల కలుసుకున్నాం.

**అంబటి శ్రీనివాస్:** తెలంగాణ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ తరఫున చీఫ్ సెక్రటరీని కలిసి కరెంటు కొనుక్కరావాలని అడిగాం. రేటు ఎంత పడుతుందో అంత మేమిస్తామని చెప్పాం. కరెంట్ ఎక్కడా దొరకట్లేదని గవర్నమెంట్ చేతులెత్తేసింది.

**శ్రీనివాస్ చౌదరి:** వేరే దారిలేక ఇందిరాపార్క్ దగ్గర టెంట్ వేశాం. విడతల వారీగా ధర్నాలు చేశాం. బాలానగర్, చర్లపల్లి, గాంధీనగర్, జీడిమెట్ల, పటాన్‌చెరు.. రోజుకు ఒక ఏరియా వాళ్లం వంతుల వారీగా ధర్నా చేశాం. కరెంటు ధర్నాలకు గవర్నమెంట్ కదల్లే. అదే టైమ్‌లో తెలంగాణ ఉద్యమం నడుస్తున్నది. తెలంగాణ వస్తే కరెంటు బాధలు పోతాయేమోనని తెలంగాణకు జై కొట్టినం.

**స్వామి నాయుడు:** కరెంటు విషయంలో కేసీఆర్ తోపు. ఏనాడూ మాట తప్పలేదు. 24 గంటలూ కరెంటు ఇచ్చారు.

**అంబటి శ్రీనివాస్:** ఒకప్పుడు అప్పు అడిగితే ఇవ్వనన్న బ్యాంకు మేనేజరే నా వర్క్‌షాప్‌కు వచ్చి లోన్ ఇచ్చారు. నా దగ్గర డాక్యుమెంట్లు లేవంటే 'అది నేను చూసుకుంటాలే' అని సమాధానమిచ్చారు. పది లక్షల రూపాయలు లోన్ తీసుకున్నా. కరెంటును నమ్మే నాకు బ్యాంకు వాళ్లు లోన్ ఇచ్చారు. కరెంటును నమ్ముకునే నేనూ బతుకుతున్న.

**శ్రీనివాస్ చౌదరి:** ఇప్పుడు మంచిగానే ఉన్నది. పాత అప్పులు కొద్దిగ ఉన్నాయి. మళ్లా కేసీఆర్ గవర్నమెంటే వస్తే అప్పు తీరినట్టే. కరెంటు లేకుంటే మళ్లా వెనక్కి పోయినట్టే.

**స్వామి నాయుడు:** సీఎం కేసీఆర్ వల్ల కరెంటు కష్టాలు తీరినయ్. ఆయనే మళ్లా సీఎం. ఇది పక్కా!

**శివరామకృష్ణ:** మా మదర్ కంపెనీలన్నీ ముందుకు పోయినయ్. మాకు ఆర్డర్లు పెరిగాయి. ఆదాయం పెరిగింది. పనికి తగ్గ కరెంటు వస్తున్నది. వర్కర్లను మళ్లీ పనికి పిలిచాం. ఫుల్ టైమ్ వర్క్, పైసలు ఫుల్. ఏ షెడ్డులో కలుసుకున్నామో అదే షెడ్డుని అందరం కలిసి నడుపుకొంటున్నాం. మాకు ఆంధ్రా, తెలంగాణ భేదాల్లేవు. కులమత స్పర్ధలు లేవు. సంతోషంగా ఉన్నాం. పాత అప్పులు తీరుస్తున్న.

గుజరాత్‌లోని నర్మదా కెనాల్



## పనిమంతుడు ఎవరు?

### ఆలస్యం మూల్యం రూ.5 లక్షల కోట్లు

తొమ్మిదిన్నరేండ్లలో కేంద్రంలోని బీజేపీ సర్కారు చేపట్టిన 1,763 మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో డెడ్‌లైన్ పూర్తయినప్పటికీ ఇంకా 842 ప్రాజెక్టుల నిర్మాణం కొనసాగుతూనే ఉన్నది. జాప్యం కారణంగా ఖజానాపై రూ.5 లక్షల కోట్ల అదనపు భారం పడింది.

### జెట్ స్పీడ్ లాభం రూ.3 లక్షల కోట్లు

తెలంగాణ సర్కారు కాళేశ్వరం ప్రాజెక్టును కేవలం మూడేండ్లలోనే పూర్తి చేసింది. ఒకవేళ ఇప్పటివరకూ ఆ ప్రాజెక్టు పనులు పూర్తవ్వకపోతే, నిర్మాణ వ్యయం మూడు రెట్లు (రూ. 3 లక్షల కోట్లు) పెరిగేదని నిపుణుల అంచనా.

కాళేశ్వరం కాల్వ

